సాక్షి
వికారాబాద్

సోమవారం । 18 । నవంబర్ । 2024



పత్తి తూకం.. రైతన్న భద్రం

పత్తి రైతులను దళారులు నట్టేట ముంచుతున్నారు. తూకాల్లో మోసాలకు పాల్పడుతూ దోచుకుంటున్నారు. 8లో ▸



కిలో కొంటే ఒట్టు..!

ప్రభుత్వం పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించినా క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకావడం లేదు. 8లో ▸



నిరుపయోగం..

దౌల్తాబాద్ మండలంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు పెడ్లు నిరుపయోగంగా మారాయి. 9లో ▸

న్యూస్‌రీల్

రాములుకు టీచర్ స్ఫూర్తి అవార్డు



రాములును సత్కరిస్తున్న శారదా ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకులు

కొందుర్గు: విద్యార్థులకు 22 ఏళ్లుగా అందిస్తున్న సేవలకుగాను జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం రాములుకు టీచర్ స్ఫూర్తి అవార్డు వరించింది. శారదా ఎడ్యుకేషన్ సొసైటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని భాస్కర ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాములు మాట్లాడుతూ.. అవార్డుతో తనపై బాధ్యత మరింత పెరిగిందని.. పేదల విద్యాభివృద్ధికి పాటుపడతానన్నారు. అవార్డు అందజేసిన నిర్వాహకులకు, శాతవాహన వర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్, కమలామనోహర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా అశోక్

ఆమనగల్లు: పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కొలుకులపల్లికి చెందిన మసన అశోక్ నియమితులయ్యారు. ఆదివారం సంఘం నిర్వహించిన కార్యాక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చ సుధాకర్‌రావు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

'బుద్ధుడి నుంచి గద్దర్ వరకు..' పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జీవీవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకుడు బొజ్జ భిక్షమయ్య రచించిన 'బుద్ధుడి నుంచి గద్దర్ వరకు..', ప్రముఖ రచయిత డాక్టర్ కాలువ మల్లయ్య రచించిన 'అస్పృశ్య యోధుడు' పుస్తకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా హాజరైన మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు మాట్లాడుతూ అభ్యుదయ శక్తులన్నీ ఏకం కావాలని, అందుకు తాను వారధిగా పని చేస్తానని చెప్పారు. కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టుల మధ్య అంతరం ఏర్పడిందని, ఆ అంతరాలను పూడ్చడానికి తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బి.ఎస్. రాములు తదితరులు పాల్గొన్నారు.

అనంతుడి సేవలో భక్తజనం



అనంతగిరి గుట్టలో వెలసిన అనంతపద్మనాభ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేలాది మంది తరలిరావడంతో స్వామివారి దర్శనానికి గంటల సమయం పట్టింది. ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం సామూహిక వనభోజనాలు చేశారు. జాతరలో భాగంగా స్వామివారు ఉదయం 11గంటలకు ముత్యాలపందిరి వాహనంపై విహరించారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– అనంతగిరి



జాతర.. జనసంద్రం

అట్టహాసంగా ముగిసిన ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ వేడుక

- దైవసందేశం వినిపించిన పాస్టర్లు
- శిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- మార్మోగిన ఏసునామస్మరణ
- తిరుగు ప్రయాణానికి యాత్రికుల పాట్లు

ధారూరు: ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు భక్తులు పోటెత్తారు. ఆరు రోజుల పాటు సాగిన ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. జాతర ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన శిలువ వద్ద వేలాది మంది భక్తులు ప్రార్థనలు చేశారు. పాస్టర్లు దైవసందేశం వినిపించారు. వేల సంఖ్యలో వాహనాలు రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సీఐ రఘురాం తోపాటు పోలీసు సిబ్బంది జాతరకు నాలుగు కిలో మీటర్ల దూరంలోనే వాహనాలను ఆపి అక్కడి నుంచి ఆటోల్లో భక్తులను తరలించారు. దీంతో ట్రాఫిక్ సమస్య తగ్గింది. జాతర ముగియడంతో సాయంత్రం యాత్రికులు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో ధారూరు రైల్వే స్టేషన్ జనంతో నిండిపోయింది. దాదాపు లక్ష మంది వరకు రవాణా సౌకర్యం లేక జాతరలోనే ఉండిపోయారు. రైళ్ల కోసం కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. బీదర్ నుంచి ప్రత్యేక రైలు రావడంతో అందులో వెయ్యి మంది వరకు వెళ్లిపోయారు. నాందేడ్ – బెంగళూర్, బెంగళూర్ – నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే ఆగాయి. దీంతో వేల మంది గమ్య స్థానాలకు బయలుదేరి వెళ్లారు.



జాతరకు తరలివస్తున్న భక్తులు

కోళ్లు, మేకలు, గొర్రెలకు వేలం

జాతరకు వచ్చిన భక్తులు కానుకలు సమర్పించుకున్నారు. మరి కొంత మంది కోళ్లు, మేకలు, గొర్రెలను దానంగా అందజేశారు. సాయంత్రం వాటిని జాతర కమిటీ వేలం వేసింది.

మూగబోయిన ఫోన్లు

జాతరలో అన్ని కంపెనీల సెల్‌ఫోన్లు మూగబోయాయి. ఆదివారం దాదాపు రెండు లక్షల మంది జాతరకు రావడంతో నెట్‌వర్క్ పని చేయలేదు. సిగ్నల్స్ అందక భక్తులు ఇబ్బంది పడ్డారు. తప్పిపోయిన వారిని వెతుక్కోవడానికి నానా తిప్పలు పడ్డారు. పోలీసుల సహాయంతో మైక్‌లో అనౌన్స్ చేసి కలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్‌లు సుమిత్ర, నెల్సన్, జాన్‌వెస్లీ, విజయరావు, ఆల్ ఇండియా లే లీడర్ ఇమానియల్, హెచ్‌ఆర్‌సీలు గ్యాబ్రియల్, విజయకుమార్ పాల్గొన్నారు.



ఏసుక్రీస్తు శిలువ వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు



ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న బిషప్‌లు కర్మరే, డేనియల్, ప్రత్యేక ఆహ్వానితులు రెవరెన్ ఇసాక్ తదితరులు



దైవసందేశం వింటున్న యాత్రికులు

విజయోత్సవాలను సక్సెస్ చేద్దాం

కలెక్టర్ ప్రతీక్‌జైన్



కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజాపాలన విజయోత్సవాలను సక్సెస్ చేద్దామని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లాలో ఈ నెల 19 నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కొడంగల్‌లో రెండు రోజులపాటు..

తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై కళాయాత్ర బృందం ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల, అంతడుపుల నాగరాజు రాష్ట్రమంతా పర్యటిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 6గంటలకు కొడంగల్‌లోని రాఘవేంద్ర గార్డెన్‌లో ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 7న అంతడుపుల నాగరాజు బృందంచే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారని తెలిపారు. అదేవిధంగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డి తోపాటు శాసన సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

నేటి ప్రజావాణి రద్దు

గ్రూప్ –3 పరీక్షల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు

తొలిరోజు ప్రశాంతంగా గ్రూప్ –3



వికారాబాద్‌లోని సిద్ధార్థ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



కొత్తగడి సెంటర్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

అనంతగిరి: జిల్లాలో ఆదివారం గ్రూప్–3 పరీక్షలు (రెండు పేపర్లు) ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన మొదటి సెషన్ పరీక్షకు 6,981 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 4,185మంది ఎగ్జామ్ రాశారు. 2,796మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో సెషన్ పరీక్షకు 6,981మందికి గాను 4,195 మంది హాజరు కాగా 2,786 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 8.30గంటల నుంచే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. ఆలస్యంగా వచ్చిన వారిని పరీక్ష కేంద్రంలోకి పంపలేదు. వికారాబాద్‌లోని సిద్దార్థ కళాశాల సెంటర్‌కు 8మంది అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు లోనికి అనుమతించలేదు. వికారాబాద్ పట్టణంలోని ఎస్‌ఏపీ కళాశాల, సిద్ధార్థ కళాశాల సెంటర్లను కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిశీలించారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను పరిశీలించి, ప్రశ్న పత్రాల తరలింపు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ సుధీర్, ఆర్‌డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు. పట్టణంలోని గ్రూప్–3 పరీక్ష కేంద్రాలను ఎస్పీ నారాయణరెడ్డి పరిశీలించారు.



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

కల్తీ కల్లు.. ఆరోగ్యానికి చిల్లు

- క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ఫాజోలమ్‌లతో కల్లు తయారీ
- మోతాదుకు మించి రసాయనాలు కలపడంతో ప్రమాదం
- పట్టించుకోని జిల్లా ఎక్సైజ్ అధికారులు
- మామూళ్ల మత్తులో జోగుతున్న వైనం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో 'కల్తీ' కల్లు మాఫియా రెచ్చిపోతోంది. మోతాదుకు మించి రసాయనాలు కలిపి తయారు చేస్తున్న ఈ కల్లును తాగుతున్న అమాయక కూలీలు, పేదలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎప్పటికప్పుడు కల్లు అమ్మకాలపై తనిఖీలు నిర్వహించి పరీక్షలు నిర్వహించాల్సిన శంషాబాద్, సరూర్‌నగర్ అబ్కారీ అధికారులు వారిచ్చే ముడుపులు పుచ్చుకుని కిమ్మనడం లేదనే ఆరోపణలున్నాయి. ఫలితంగా ఇటీవల మీర్‌పేటలోని నందనవనం బస్తీకి చెందిన ఓ మహిళ కల్తీకల్లు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. మోతాదుకు మించి రసాయనాలు కలిపి, కల్తీ కల్లును తయారు చేసి ప్రజారోగ్యంతో ఆటలాడుతున్న కల్తీ కల్లు మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన ఎక్సైజ్‌శాఖ వారికి అండగా నిలుస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బస్తీలే కల్లు కాంపౌండ్లకు అడ్డాలు

పకృతి సిద్ధమైన తాటి, ఈత చెట్ల నుంచి తీసిన కల్లు ఆరోగ్యకరమైంది. స్వచ్ఛమైన ఈ కల్లును సేవించడం వల్ల కిడ్నీ సంబంధిత సమస్యలు సైతం తొలగుతాయి. సాధారణంగా చెట్ల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట్ల కల్తీ తక్కువ. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడం, అప్పటి వరకు ఈ వృత్తిపై ఆధారపడిన గీత కార్మికులు కూడా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడం ఫలితంగా కల్లుకు కొరత ఏర్పడింది. గుడుంబా దొరక్క పోవడం, మద్యం



ధరలు ఎక్కువగా ఉండటంతో రోజువారీ కూలీలు కృత్రిమంగా లభించే కల్లుకు అలవాటుపడుతున్నారు. ప్రజల్లోని ఈ బలహీనతను కొంత మంది కల్లు వ్యాపారులు సొమ్ము చేసుకుంటారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ఫాజోలమ్ వంటి ప్రమాదకరమైన రసాయనాలను వినియోగించి కల్తీ కల్లును తయారు చేస్తున్నారు. తయారీలో మోతాదుకు మించి రసాయనాలను వినియోగిస్తుండడంతో దీన్ని సేవించిన వారు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరుతున్నారు. శంషాబాద్, రాజీవ్‌గాంధీ నగర్, మీర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్, బొంగుళూరుగేటు, ఆదిబట్ల, యాచారం, చేవెళ్ల, షాద్‌నగర్, షాబాద్, కడ్తాల్ శివారు ప్రాంతాల్లో ఈ కల్తీ కల్లు విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిజానికి ప్రస్తుత సీజన్‌లో తాటి చెట్లకు ఆశించిన స్థాయిలో కల్లు ఉత్పత్తి కాదు. ఒకటి రెండు తాటి చెట్ల నుంచి కల్లును సేకరించినా, ఇది వారి సొంత అవసరాలకు కూడా సరిపోదు. కానీ జిల్లాలోని ఏ ప్రధాన రోడ్డు వెంట చూసినా కృత్రిమ కల్లు దుకాణాలే దర్శనమిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఆయా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, నమూనాలు సేకరించాల్సిన ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒక లైసెన్సు.. రెండు దుకాణాలు

శంషాబాద్ పట్టణంలోని ఓ ప్రధాన కల్లు దుకాణంలో సభ్యుల మధ్య జరిగిన గొడవతో కల్లు విక్రయాలు రోడ్డుపైకి వచ్చాయి. గొడవల కారణంగా దాదాపు నెల రోజులుగా దుకాణం తెరవని విక్రయదారులు తమ దందాను మాత్రం యథేచ్ఛగా రోడ్డెక్కించారు. దాదాపు మూడు వందల సభ్యులతో ఉన్న ఈ దుకాణంలో కొంత కాలంగా వ్యాపారుల మధ్య గొడవలు కొనసాగుతున్నాయి. ఒకే దుకాణంలో రెండు వేర్వేరు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఎక్సైజ్ నిబంధనల మేరకు ఒక లైసెన్స్‌పై రెండు విక్రయ కేంద్రాలు నడిపిస్తున్న విషయం తెలుసుకున్న ఆబ్కారీ అధికారులు ఒక లైసెన్స్‌పై ఒకటే దుకాణం నడిపించాలని హెచ్చరించారు. వ్యాపారులు మాత్రం ఇదేమి పట్టనట్టుగా దందా కొనసాగిస్తున్నారు. రైల్వేస్టేషన్ నుంచి వీకర్ సెక్షన్ కాలనీ మీదుగా ఉన్న రోడ్డుపైనే కల్లు విక్రయాలు జరుపుతుండటంతో కాలనీ వాసులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేదు.

నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది

డైజోఫాం ఇతర రసాయనాలతో తయారు చేసిన కృత్రిమ కల్లును సేవించిన వారిలో నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. నీరసం, ఒంటి నొప్పులతో పాటు కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. మానసిక విజ్ఞత కోల్పోయి పిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. ఈ సమయంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలకే ప్రమాదం. ఈ క్షతగాత్రులకు సర్జరీల సమయంలో నొప్పి నివారణ కోసం ఇచ్చే మత్తు ఇంజక్షన్లు సైతం పని చేయవు. మోతాదుకు మించిన డోసు ఇంజక్షన్లు ఇవ్వాల్సి వస్తుంది. సాధ్యమైనంత వరకు ఈ కల్లును సేవించక పోవడమే ఉత్తమం.

– డాక్టర్ రాజేశ్, న్యూరో సర్జన్

ప్రజాప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: ప్రజా ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన ఏడాది పూర్తవుతున్న తరుణంలో ఆదివారం పట్టణంలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన విజయోత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల, ఆర్‌డీఓ సరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్ల రాచరిక పాలనకు ప్రజలు చరమగీతం పాడి ప్రజా ప్రభుత్వానికి పట్టం కట్టారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా నెరవేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి ముందుకు సాగి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలందరికి చెప్పేందుకే ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహిస్తోందన్నారు.

ఆకట్టుకున్న ఆటా–పాట

ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు నిర్వహించిన ఆటా–పాటా ఆహుతులను అలరించాయి. అంతడుపుల నాగరాజు కళా బృందం సభ్యులు ప్రభుత్వం పథకాలను ఆటాపాట రూపంలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, రఘునాయక్, బసిరెడ్డి నరేందర్‌రెడ్డి, తాండ్ర విశాల, శ్రావణ్‌కుమార్, కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, చంద్రశేఖర్, సర్వర్ పాషా, మహ్మద్ ఇబ్రహీం, జమృద్‌ఖాన్ పాల్గొన్నారు.

మళ్లీ మొండి 'చేయి'!

- మహేశ్వరం మండలం హస్తం శ్రేణుల్లో అసంతృప్తి జ్వాలలు
- ఏఎంసీ చైర్మన్ పదవి మళ్లీ కందుకూరు మండలానికే..
- కేఎల్‌ఆర్ తీరుపై గిరిజన నేతల గుర్రు

మహేశ్వరం: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్నిక కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాల రాజేసింది. మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయింది. దీంతో మహేశ్వరం, కందుకూరు ఎస్టీ నేతలు చైర్మన్ కుర్చీ దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాడిన నాటి నుంచి ఇప్పటి వరకు మూడు పర్యాయాలు కందుకూరు మండలానికి చెందిన వారే చైర్మన్‌గా ఉన్నారు. ఈ సారి మహేశ్వరం మండల వాసికి చైర్మన్ పదవి కట్టబెట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ మరో మారు కందుకూరు మండలానికి చెందిన వారికే ఇచ్చేందుకు యత్నిస్తున్నారు. ఈ మేరకు చైర్మన్‌గా సభావత్ కృష్ణా నాయక్, వైస్ చైర్మన్‌గా జి.అంజయ్య ముదిరాజ్ పేరును ప్రతిపాదిస్తూ ఆదివారం మార్కెట్ కమిటీ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. విషయం తెలుసుకున్న మహేశ్వరం మండలానికి గిరిజన నేతలు కేఎల్లార్‌పై అసంతృప్తితో రగిలిపోతున్నారు. కేఎల్లార్ తమను నమ్మించి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ పటిష్టానికి బీఆర్‌ఎస్ నేతల అక్రమ కేసులకు బెదరకుండా పనిచేసినా తమను విస్మరించడం సరికాదంటున్నారు. ఏక పక్షంగా ఎంపిక చేయడం తగదంటున్నారు. ఈ మేరకు కేఎల్‌ఆర్ తీరును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు మహేశ్వరం హస్తం శ్రేణులు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా కేఎల్‌ఆర్ పునరాలోచించి మహేశ్వరం మండలానికి చెందిన గిరిజన నేతలకు ఏఎంసీ చైర్మన్ పదవి కట్టబెట్టి మాట నిలబెట్టుకోవాలని లేదంటే పార్టీకి తీవ్ర నష్టం ఉంటుందని హెచ్చరిస్తున్నారు.



మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కృష్ణానాయక్ పేరును ప్రతిపాదిస్తున్న కేఎల్‌ఆర్

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతదేహం

అనంతగిరి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వికారాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ భీంకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి నిత్యం రైల్వే స్టేషన్ ఏరియాలో భిక్షాటన చేస్తూ సమీపంలోని దుకాణాల వద్దే పడుకునే వాడు. ఆదివారం ఉదయం అక్కడే సమీపంలోని ఓ హోటల్ ముందు విగతాజీవిలా పడి ఉండటాన్ని సదరు హోటల్ యాజమాని గమనించి పోలీసులకు సమాచారం చేరవేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడు ఆహారం సరిగ్గా తీసుకోక ఆకలితో చనిపోయి ఉంటాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మృతుడి ఒంటిపై గ్రీన్ కలర్ షర్ట్ దానిపై ఉలెన్ చలికోటు, బూడిదరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడి వయస్సు సమారు 45 వరకు ఉంటుందన్నారు. ఆచూకీ తెలిసిన వారు వికారాబాద్ పీఎస్‌లో గానీ, 8712670030 నంబర్‌పై సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మృతదేహం లభ్యం

అనంతగిరి: వికారాబాద్‌లోని శివసాగర్ చెరువులో ప్రమాదవశాత్తు మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమయిందని సీఐ భీంకుమార్ తెలిపారు. మృతదేహం వద్ద లభించిన ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి కాప్రా ప్రాంతానికి చెందిన విక్రం మహంతి(24) మూడేళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతని ఆర్థిక పరిస్థితి బాగా లేనందున అధికంగా అప్పుల చేశాడు. దీంతో మనోవేదనతో ఈ నెల 11న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా తన స్కూటీపై వికారాబాద్ వైపు వచ్చాడు. కాగా తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో శివసాగర్ చెరువు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు స్కూటీ అదుపు తప్పింది. ఈ క్రమంలో చెరువులో పడి మృతి చెందాడని సీఐ తెలిపారు. ఈ విషయంపై కుషాయిగూడ పీఎస్‌లో మృతుడి తండ్రి నరసింహ మహంతి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదయిందని వివరించారు.

కుక్కర్ పేలి వృద్ధుడి మృతి


సోమేశ్ (ఫైల్)

అనంతగిరి: ప్రమాదవశాత్తు ఎల్రక్టిక్ రైస్ కుక్కర్ పేలి ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన వికారాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ పట్టణంలోని గాంధీకాలనీకి చెందిన సోమేశ్‌కు(82) ముగ్గురు కూతుర్లు ఉన్నారు. వారందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. రెండు సంవత్సరాల క్రితం మృతుని భార్య కళావతి మృతి చెందడంతో ఇంట్లో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి సోమేశ అన్నం వండుకునేందుకు ఎల్రక్టిక్ రైస్ కుక్కర్‌లో పెట్టాడు. ప్రమాదవశాత్తు అది పేలి కరెంట్ షాక్ తగిలి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం గమనించిన స్థానికులు కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం చేరవేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి పెద్ద అల్లుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీం కుమార్ తెలిపారు.

కలప తరలిస్తున్న లారీ పట్టివేత


పట్టుబడిన లారీ

బషీరాబాద్: అక్రమంగా కలప తరలిస్తున్న ఓ లారీని బషీరాబాద్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఏఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బుదాన్‌ఖుర్దు గ్రామానికి చెందిన ఇప్ప మనోహర్ అనే లారీ డ్రైవర్ కొంత మంది కార్మికులను తీసుకువచ్చి జీవన్గీలో కట్‌చేసి పెట్టిన కలప(సుబాబ్)ను లాలోడ్ చేశారు. లారీని హైదరాబాద్ తరలిస్తుండగా గ్రామానికి చెందిన కొందరు అడ్డుకొని 100కు డయల్ చేసి ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న బషీరాబాద్ పోలీసులు గ్రామానికి చేరుకొని విచారణ జరిపారు. కలప తరలించడానికి లారీకి ఎలాంటి అనుమతులు లేవని గుర్తించారు. దీంతో పట్టుబడిన లారీని పోలీసులు ఠాణాకు తీసుకెళ్లారు. అయితే కలప వ్యాపారం చేసే వ్యక్తి ఎవరనేది డ్రైవర్ చెప్పకపోవడంతో లారీని తాండూరు ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు.

పత్తి తూకం.. రైతన్న భద్రం

పత్తి రైతులను దళారులు నట్టేట ముంచుతున్నారు. అమాయక అన్నదాతలను లక్ష్యంగా చేసుకొని తూకాల్లో అవకతవకలకు పాల్పడుతూ అందిన కాడికి దోచుకుంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

- కాంటా పేరుతో జరుగుతున్న అవకతవకలు
- నష్ట పోతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


పెద్దేముల్‌లో పత్తిని విక్రయానికి తీసుకెళ్తున్న రైతులు

పెద్దేముల్: మండలంలో సుమారు 34 వేల ఎకరాల్లో పత్తి, కంది, పెసర, మినుముతో పాటు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. అందులో పత్తి–15,607 ఎకరాలు, కంది –9,975, వరి–5,143, పెసర– 1221, మినుము–1945 సాగవుతున్నట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది పత్తి, కంది సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పత్తి పంటకు ప్రభుత్వం మద్దతు ధర దక్కుతుందనుకుంటే దళారుల నుంచి భంగపాటు తప్పటం లేదు. పంటలు చేతికి రాకముందే రైతులకు గాలం వేస్తున్నారు. ధరలు ఎక్కువ ఇస్తామంటూ తూకంలో మోసం చేస్తున్నారు. ఏటా దళారులు తూకాల్లో జరుగుతున్న మోసాలను రైతన్నలు పట్టుకున్న అధికారులు సహకరించటం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నాలుగేళ్ల నుంచి మండలంలోని పెద్దేముల్, మారేపల్లి, నాగులపల్లి, రుద్రారం, జనగాం, రుక్మాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో రైతులు తూకాల్లో జరుగుతున్న మోసాలను బహిరంగంగా పట్టుకున్న ఏ అధికారి ఇంత వరకు వచ్చి చర్యలు తీసుకోలేదు. తూనిక శాఖ అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పత్రికల్లో వచ్చిన సమయంలో నామమాత్రంగా వచ్చి వెళుతున్నారని స్థానికులు వాపోతున్నారు. రాళ్ల తూకాలతో క్వింటాళ్లకు సుమారు 8 నుండి 10 కిలోల వరకు దోచుకుంటున్నారు. ఇదేంటని అడిగితే రైతులపై దౌర్జన్యాలు చేస్తున్నారు.

తూకం వ్యక్తికి భారీగా కూలీ

దళారులు.. పంట పండించిన రైతు కంటే తూకం చేసే వ్యక్తికి సకల మర్యాదలు చేస్తున్నారు. రోజుకు కూలీ రూ.2,000 నుంచి రూ.2500 వరకు చెల్లిస్తున్నారు. రెండేళ్ల నుంచి రుద్రారం, పెద్దేముల్, మంబాపూర్, నాగులపల్లి, ఇందూరుతో పాటు పలు గ్రామాల్లో దళారులు తూకాల వద్ద మోసం చేసిన సమయంలో రూ.లక్షల జరిమానా కట్టి వదిలించుకున్నా సంఘటనలున్నాయి. గతంలో బంట్వారం మండలం సల్‌బత్తాపూర్‌లో తూకంలో వ్యత్యాసం ఉందని రైతులు డీసీఎం వాహనానికి గాలి తీసి అడ్డుకున్నారు. రుద్రారం, నాగులపల్లి గ్రామంలో పత్తి తూకాల సమయంలో రైతులు పట్టుకోవడంతో ఎక్కువ డబ్బులు ఇస్తామంటూ దళారులు తప్పించుకొన్న సంఘటనలున్నాయి.


తూకాల్లో అవకతవకలు జరగడంతో డీసీఎంను అడ్డుకున్న అన్నదాతలు (ఫైల్)

కేసులు పెట్టాలి



ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి రైతులను మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. తూకాల్లో అవకతవకలు చేస్తే దళారితో పాటు తూకం చేసే వ్యక్తిపై కేసులు పెట్టాలి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర వచ్చేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి. తూకంలో రైతులను మోసం చేస్తే ఆ దళారిని అడ్డుకోవాలి.

– శ్రీనివాస్, రైతు, దుగ్గాపూర్

పెట్టుబడి కష్టమే



పత్తి పంట సాగుకు రూ.లక్షలు వెచ్చించి పెట్టుబడులు పెట్టాం. కానీ దిగుబడి రావటం లేదు. దీంతో ఏటా అప్పుల పాలవుతున్నాం. ప్రభుత్వం పంట పాడైన రైతులకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలి. భారీ వర్షాలకు 50 శాతం పంటలు పాడయ్యాయి. మా గోడు ఎవరికి చెప్పిన లాభం లేదు. రోజు రోజుకు అప్పుల భారం పెరుగుతోంది.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, నాగులపల్లి

కఠిన చర్యలు



ఆరుగాలం పండించిన రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటాం. దళారులు పత్తి తూకాల్లో మోసం చేసినట్లు ఫిర్యాదులు వస్తే చట్ట పరమైన చర్యలు తప్పవు. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తి లేదు. ఎవరికైనా తూకంలో మోసం చేస్తే ఫిర్యాదు చేయండి. వారిపై కేసులు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేస్తాం.

– గిరి, ఎస్ఐ, పెద్దేముల్

ప్రశాంతంగా గ్రూప్–3 పరీక్ష

తాండూరులో 56 శాతం గైర్హాజరు

- ఆలస్యంగా కేంద్రాలకు వచ్చిన 20 మంది అభ్యర్థులు

తాండూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్రూప్–3 పరీక్షలకు అభ్యర్థుల నుంచి స్పందన కరువైంది. గ్రూప్–3 పరీక్షలకు తాండూరు పట్టణ పరిధిలో 44 శాతం మాత్రమే హాజరయ్యారు. ఆదివారం 11 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్‌ల్లో పరీక్షలను సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు. 3,215 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా మొదటి సెషన్‌లో 1,413 మంది అభ్యర్థులు పరీక్షలు రాశా రు. 1,802 మంది అభ్యర్థులు పరీక్షలకు గైర్హాజర య్యారు. ఈ పరీక్షల్లో 44శాతం పరీక్షలురాసిన వారున్నారు. మధ్యాహ్నం రెండుగంటలకు జరిగిన సెషన్‌లో పరీక్షలకు 1,416 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు.1,799 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

నిమిషం ఆలస్యం

గ్రూప్–3 పరీక్షలకు 20 మంది అభ్యర్థులు ఆలస్యంగా కేంద్రాలకు చేరుకున్నారని అనుమతించ లేదు. పరీక్షలు రాసేందుకు అనుమతిని ఇవ్వాలని నిర్వాహకులను, పోలీసులను వారు వేడుకున్నారు. గడువు ముగిసిందంటూ చెప్పడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. సమయపాలన పాటిస్తున్నారంటూ ప్రభుత్వ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.

పరిగిలో 15 మంది

పరిగి: పట్టణ కేంద్రంలో ఆదివారం జరిగిన గ్రూప్–3 పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9:30 గంటలకు పరీక్ష కేంద్రాలకు రావాల్సి ఉండగా చాలా మంది ఆలస్యంగా వచ్చారు. పట్టణ కేంద్రంలో 5 పరీక్ష కేంద్రాల్లో నిమిషం వ్యవధిలో దాదాపు 15 మంది అభ్యర్థుల వరకు ఆలస్యంగా వచ్చారు. అక్కడ ఉన్న అధికారులను పోలీసులకు ఎంత బతిమిలాడిన అనుమతి ఇవ్వక పోవడంతో చేసేది ఏమి లేక వెనుదిగి వెళ్లారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.


పరిగి: ఆలస్యం కావడంతో పోలీసులను అనుమతి ఇవ్వాలని కోరుతున్న అభ్యర్థులు


పరిగి: పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు


తాండూరు: పరీక్షా కేంద్రం వద్ద సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

కల్వర్టులు.. ప్రమాదాలకు నిలయాలు

నాలుగేళ్లుగా పట్టించుకోని అధికారులు


ఎన్కెపల్లి రోడ్డులో కూలిన కల్వర్టు

బంట్వారం: కూలిన కల్వర్టులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారంటూ వాహనదారులు మండిపడుతున్నారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని రొంపల్లి, నూరుల్లాపూర్, ఎన్కెపల్లి, కోట్‌పల్లి–తాండూరు మార్గంలోని కల్వర్టులు కూలి నాలుగేళ్లు గడుస్తుంది. అయినప్పటికీ కొత్తగా నిర్మించడం లేదు. అసలే గుంతలు పడిన రోడ్లు ఆపై అక్కడక్కడ కూలిన కల్వర్టులు ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎన్కెపల్లి రోడ్డులో మూల మలుపు వద్దనే కల్వర్టు కూలింది. కొత్త వారు ఆదమరిచి అతివేగంగా వెళితే గుంతలో పడాల్సిందే. ఇప్పటికే పలువురు గాయపడ్డారు. ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళ అటుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఇప్పటికైనా సత్వరమే తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కిలో కొంటే ఒట్టు..!

బోసిపోయిన ధాన్యం కొనుగోలు కేంద్రం

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్నదాతలు


చెంగోల్లో బోసి పోయిన డీసీఎంఎస్ కేంద్రం

తాండూరు రూరల్: ఇటీవల ప్రభుత్వం ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని ప్రకటించింది. గ్రామాల్లో సైతం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేస్తుందని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. మండల పరిధిలోని చెంగోల్ గ్రామంలో 6వ తేదీన ప్రభుత్వం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ప్రస్తుతం పది రోజులు గడుస్తున్నా డీసీఎంఎస్ అధికారులు కిలో వడ్లు కూడా కొనలేదని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. అధికారులు వరి ధాన్యం కొనుగోలు చేస్తారని 20 రోజుల నుంచి బైపాస్ రోడ్డు వద్దే వడ్లు ఆరబెట్టుకుంటున్నారు. ఇంకా ఎన్ని రోజులు ఆరబోయాలని తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. దీంతో చేసేదేమిలేక రైతులు రూ.2,100లకు ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన వడ్లను సత్వరమే కొనాలని కోరుతున్నారు.

ధర్నాకు సిద్ధం..

తాము తెచ్చిన వడ్లను కొనుగోలు చేయకపోతే పెద్దెతున ధర్నాకు దిగుతామని రైతులు చెబుతున్నారు. ఈ విషయమై డీసీఎంఎస్ బ్రాంచ్ ఇన్‌చార్జి ఎల్లయ్యను వివరణ కోరగా.. మిల్లర్లతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోకపోవడంతోనే కొనుగోలు ఆలస్యమవుతుందన్నారు. రైస్ మిల్లర్లను అలర్ట్ చేసి వెంటనే ధాన్యం కొనుగోలు చేపడతామని పేర్కొన్నారు.

శోభాయమానం.. దీపోత్సవం


దీపోత్సవానికి హాజరైన భక్తులు

తాండూరు: పట్టణంలోని సీతారాంపేట్ గోశాలలో ఆదివారం కార్తీక దీపోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గోశాల సేవ సమితీ అధ్యక్షుడు, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీరజాబాల్‌రెడ్డి దంపతులు గోశాలలో తులసీపూజ, గో పూజలు చేశారు. అనంతరం భక్తులతో కలిసి దీపాలను వెలిగించారు.


దీపాలను వెలిగిస్తున్న మహిళ


భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం

మార్మోగిన శివనామస్మరణ

మంచాల: కార్తీక మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి వారి జాతర ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసాయి. ఆలయ ప్రాంగణంలో శివనామస్మరణ మార్మోగింది. భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సాక్షి రంగారెడ్డి జిల్లా: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం యాచారం పోలీసులు సీజ్ చేశారు. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. కడ్తాల్ మండలం పల్లెచల్క తండాకు చెందిన వస్లావత్ బాద్య యాచారం మండల పరిధిలోని నందివనపర్తి, చింతుల్ల తదితర గ్రామాల్లో తక్కువ ధరకు ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి ఒక ప్రైవేట్ వాహనంలో పల్లెచల్కతండాకు తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న యాచారం పోలీసులు నందివనపర్తిలో తనిఖీలు చేపట్టగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాధ్యుడైన వస్లావత్ బాద్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి


ఈశ్వర్ మృతదేహం

తలకొండపల్లి: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ విష్ణు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వద్దే ఈశ్వర్(36) సమీపంలోని సహదేవి సుర సముద్రంలో చేపలు పట్టడానికి ఆదివారం సాయంత్రం వెళ్లాడు. చెరువులో వల వేసి పక్కనున్న చెట్లకు కట్టుతున్న తరుణంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. ఈశ్వర్ కనిపించక పోవడంతో అక్కడ ఉన్న స్థానికులు చెరువులో వెతికారు. కాసేపటికి ఆయన లభ్యం కావడంతో, గట్టు మీదకు తీసుకువచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బహుజన రాజ్యాధికారానికి కృషి

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాములు

ఇబ్రహీంపట్నం రూరల్: బహుజన రాజ్యాధికారం సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పల్లాటి రాములు పిలుపునిచ్చారు. బీఎస్పీ అసెంబ్లీ కమిటీ ఆధ్వర్యంలో కోశాధికారి బంగరిగళ్ల మహేందర్ సమక్షంలో ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. జన కల్యాణ్ దివాస్‌ను ప్రారంభించిన అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు పల్లాటి రాములు మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజవకర్గంలో బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దామన్నారు. అధికారం కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షుడు వంగల కృష్ణ ప్రసాద్, ఉపాధ్యక్షుడు గుండె శ్రీనివాస్, మంచాల మండల నాయకులు మల్లన్న పాల్గొన్నారు.


కొంగకలాన్‌లో పార్టీ సభ్యత్వం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

హక్కులు సాధించుకోవాలి

మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఫైమిదా

మీర్‌పేట: మహిళల రక్షణ, హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఫైమిదా పిలుపునిచ్చారు. ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి సిర్లా హిల్స్‌లో సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి బండ యాదమ్మ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫైమిదా మాట్లాడుతూ.. సమాజంలో రోజు రోజుకు మహిళల పట్ల వివక్ష కొనసాగడంతో పాటు హింస పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కావున మహిళా సమాఖ్యను బలోపేతం చేసి దక్కాల్సిన హక్కుల కోసం సమష్టిగా పోరాడి సాధించుకోవాలని అన్నారు. అనంతరం కాలనీ మహిళలకు సభ్యత్వాన్ని అందజేశారు.


సభ్యత్వ నమోదును అందజేస్తున్న ఫైమిదా, యాదమ్మ